క్లుప్తంగా

రైతుబజారు తనిఖీ



నందిగామ(కంచికచర్ల): రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన ధరల పట్టిక మేరకే స్టాళ్ల నిర్వాహకులు కూరగాయలను విక్రయించాలని లేనిపక్షంలో స్టాళ్లను రద్దు చేస్తామని విజయవాడ మార్కెటింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంగమ్మ హెచ్చరించారు. నందిగామ రైతు బజార్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీ మాట్లాడుతూ తప్పనిసరిగా ఐడీ కార్డులు కలిగి ఉన్నవారు మాత్రమే స్టాళ్ల నిర్వహించాలన్నారు. తాజా కూరగాయలను విక్రయించాలని సూచించారు. తూకాల్లో తేడా లేకుండా చూడాలన్నారు. రైతులు, కొనుగోలుదారులతోగాని ఎటువంటి గొడవలు పడవద్దని అన్నారు. రైతు బజార్‌లో 75స్టాళ్లు ఉండగా బినామీలుగా వ్యవహరిస్తున్న 14మంది దుకాణాలను రద్దు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి సందిపాము రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలు



గరికపాడు(జగ్గయ్యపేట): మండలంలోని గరికపాడులో కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) స్థాపించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జ్యోతి యాత్ర వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ దేశంలో 1974లో పాండిచ్చేరిలో మొదటిగా కృషి విజ్ఞాన కేంద్రం స్థాపించారన్నారు. రైతులకు మేలైన విత్తనాలు తయారుచేసి రైతులకు సలహాలు సూచనలు అందిస్తున్నట్లు వివరించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటరెడ్డి, మోహన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ సందర్శన





అనుమంచిపల్లి (జగ్గయ్యపేట): గ్రామంలోని జాతీయ రహదారి పక్కనున్న ఇసుక స్టాక్ పాయింట్‌ను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం సందర్శించారు. స్టాక్ పాయింట్ వద్ద కారును నిలుపుదల చేసిన డీడీ, వాహనంలో నుంచే స్టాక్ పాయింట్ అధికారులతో మాట్లాడారు. ఇసుక స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను తరలించే ప్రక్రియను పరిశీలించారు. ఇసుక కావలసినవారు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించి తీసుకువెళ్లాలని సూచించారు. డీడీ వెంట ఏడీ వీరాస్వామి ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవంలో పలువురు ఉభయదాతలు, భక్తులు గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. స్వామివారి కల్యాణంలో పాల్గొన్నా, వీక్షించినా, స్వామివారికి సమర్పించిన తలంబ్రాలు స్వీకరించినా భక్తుల ఇంట ఇబ్బందులు తొలగుతాయని, సంతాన భాగ్యం, వివాహ యోగం కలుగుతుందని అర్చకులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం ఈవో కె.ఎస్.రామరావు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేయించారు.

పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల (జాతర) పూజా కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి కుంభాభిషేకం, కుంకుమపూజలు చేశబుూరు. నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యవర్గం అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి మాట్లాడుతూ తిరునాళ్లలో చివరి రోజు 14వ తేదీ ఉదయం 7 గంటలలోపు కృష్ణానది నుంచి తీసుకువచ్చిన జలంతో పోలేరమ్మకు కుంభాభిషేకం, పంచామృతాలతో అభిషేకం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు.

పీహెచ్‌సీల వద్ద ఆశావర్కర్ల ఆందోళన

వీరులపాడు: అధికారుల నిర్వాకం కారణంగా అనారోగ్యం బారినపడి మృతి చెందిన ఎ.కొండూరు ఆశావర్కర్ తోట రాధమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ, ఆశావర్కర్‌ల సంఘ నాయకులు సుబ్బమ్మ, రాణి, కృష్ణవేణి డిమాండ్ చేశారు. ఎ.కొండూరు ఆరోగ్యకేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్ రాధమ్మ మృతిచెందిన నేపథ్యంలో ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ రాధమ్మ నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నా అధికారులు సెలవు మంజూరు చేయక పోవడంతో ఆమె విధుల్లోనే మృతి చెందిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



అల్లూరు పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు



లింగాలపాడు పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

లింగాలపాడు పీహెచ్‌సీ వద్ద..

నందిగామ(కంచికచర్ల) : ఏ.కొండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలోనే మృతిచెందిన ఆశా వర్కర్ తోట రాధమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని లింగాలపాడు పీహెచ్‌సీ వద్ద శుక్రవారం సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు ఆందోళన చేశారు. అనంతరం వైద్యులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ ఆశావర్కర్ తోట రాధమ్మకు ఎ.కొండూరు పీహెచ్‌సీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి సకాలంలో సెలవు ఇవ్వకపోవడంతో ఆమె మృతి చెందిందని ఆరోపించారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎకరం భూమి అందించి ఆదుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘ నాయకులు తిరుమలదేవి. వనజ, ప్రభావతి, నాగమణి, గోవిందమ్మ, శివకుమారి, స్రవంతి, కవిత, సునీత, ప్రశాంతి, మోనిక, పద్మ, యేసురాజాం, కవిత, నాగరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో ప్రభుత్వాసుపత్రి వద్ద..

జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల ఎ.కొండూరు మండలంలో తీవ్ర జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన ఆశావర్కర్ తోట రాధమ్మ కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి, మండలంలోని బూచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్‌మియా మాట్లాడుతూ రాధమ్మ మృతికి కారమణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు ఆస్పత్రి వైద్యులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు సుధారాణి, రేణుక, హుస్సేన్‌బీ, ఉమ, బేబి రాణి, శారద తదితరులు పాల్గొన్నారు.



పేట ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

ఎంపీపీ మార్కపూడి గాంధీ

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెంటనే వేధింపులు ఆపాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీల్లో పనిచేస్తున్న చిరుద్యోగులను గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేధింపులకు గురిచేస్తుండటంతో వారు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. వెంటనే వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం తదితర గ్రామాల్లో అనధికారికంగా విత్తనాలు విక్రయిస్తున్నారని, నర్సరీల్లో కూడా నాణ్యమైన మొక్కలు రైతులకు అందేలా చూడాలన్నారు. దీనిపై ఏవో కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వెంకటాపురంలో ఎరువుల విక్రయానికి మాత్రమే లైసెన్స్ ఉందని స్పష్టం చేశారు. విత్తనాల విక్రయాలు చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ, జెడ్పీటీసీ అధికారులకు సూచించారు. తహసీల్దార్ వి.అమ్మాజీ మాట్లాడుతూ మండలంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యాధికారి పి.ఇందిర మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సీజన్‌లో దోమల ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాంతులు, విరోచనాలు, జ్వరాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పశువైద్యాధికారి పి.అనిల్ మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి సంబంధించి షెడ్ల నిర్మాణానికి గ్రామసభ ద్వారా ఎన్నికైన అర్హులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నట్లు వివరించారు. ఆర్‌అండ్‌బీ డీఈ నరేష్ మాట్లాడుతూ మండలంలో రోడ్ల మరమ్మతులకు రూ.60 లక్షలతో అంచనాలు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో సిద్ధారెడ్డి, ఎంఈవో రవీంద్ర, ఏపీవో తిరుపతయ్య, ఉద్యానవన శాఖాధికారి వర్ధిని, ఇరిగేషన్ జేఈ లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, తహసీల్దార్ అమ్మాజీ



సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు

రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే సౌమ్య

పల్లెంపల్లి(వీరులపాడు): ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా ఉండి ఆదుకుంటుందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని పల్లెంపల్లి గ్రామంలోని ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగునీరు అందించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ నాయకులు దాములూరి మధుసూదనరావు, వట్టికొండ చంద్రమోహన్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ(కంచికచర్ల): విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు నందిగామ పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ దిబ్బయ్య శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు సబ్‌స్టేషన్‌లో సిక్ వీసీబీ స్థానంలో నూతన వీసీబీ ఏర్పాటు చేయనున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏఈఈ ఎల్.తారాచంద్ శుక్రవారం తెలిపారు. పేట మండలంలోని చిల్లకల్లు, తిరుమలగిరి, ధర్మవరప్పాడు తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థినికి సత్కారం

ల్లంకి(వీరులపాడు): తమ పాఠశాల విద్యార్థి షేక్ సమీనాఅఫ్రోజ్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధిం వెల్లంకి జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చెరుకూరి రాజేశ్వరి తెలిపారు. వెల్లండి జెడ్పీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థి సమీనాఅఫ్రోజ్‌ను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజేశ్వరి మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో 600మార్కులకుగాను 567మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన సమీనాఅఫ్రోజ్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధిస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌కు చెందిన వరికుప్పల కవితకు మూడేళ్ల క్రితం శ్రీనివాసరావుకు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వివాహ సమయంలో రూ. 4 లక్షల కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. కారు డ్రైవర్‌గా పని చేసే శ్రీనివాసరావు కొంత కాలంగా భార్యను పుట్టింటికి వెళ్లి అదనంగా కట్నం తీసుకు రావాలని వేధిస్తున్నాడు. శ్రీనివాసరావుకు తల్లి సుజాత, తండ్రి సుబ్బారావు వత్తాసు పలకడంతో బాధితురాలు అత్తింటి వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు



పెనుగంచిప్రోలు: ప్రతి పాఠశాలలో ఇద్దరికి తక్కువ కాకుండా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నేపల్లి కృష్ణయ్య, జిల్లాకార్యదర్శి జిల్లేపల్లి సుధానంద్ పేర్కొన్నారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో శుక్రవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవోనంబరు 117ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జిలానీ, ఎస్.సుబ్రమణ్యస్వామి, నాయకులు దైదా దానయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకోవాలి

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకుని ప్రతిభావంతులుగా ఎదగాలని వర్ధమాన నటి 1000 వాలా సినిమా హీరోయిన్ కీర్తి అన్నారు. ఆంధ్ర లయోలా కళాశాలలో రెండు రోజులుగా జరిగిన మాగ్నలైట్ 2కే24 కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముఖ్యఅతిథి కీర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక, సాంస్కృతిక, కళా రంగాల్లో సైతం అవగాహన పెంచుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. మిస్టర్ అండ్ మిస్ లయోలా కాలేజీ ఈవెంట్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దర్శకుడు అఫ్జల్, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఈవెంట్‌లో ప్రతిభచూపిన విద్యార్థులతో హీరోయిన్ కీర్తి, డైరెక్టర్ అఫ్జల్

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై మృతుని కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పాతరాజరాజేశ్వరిపేట రెడ్డి కొట్టు వీధికి చెందిన షేక్ మస్తాన్ తన కుమారుడు సుభానీతో నివసిస్తున్నాడు. మస్తాన్ నైజాంగేటు సెంటర్‌లోని టీ స్టాల్‌లో పని చేస్తుంటాడు. ఈ నెల 5న మస్తాన్ టీ తాగి ఇంటికి వస్తుండగా, ఓ బాలుడు బైక్‌తో బలంగా ఢీ కొట్టాడు. అతని తలకు, కాలికి తీవ్రగాయం కావడంతో వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మస్తాన్ కోలుకోలేక శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఘటనపై మృతుని కుమారుడు సుభాని ఫిర్యాదు చేశాడు.

సారె.. అందుకో దుర్గమ్మా..



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలు పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు సారె సమర్పించేందుకు భవానీపురం టీచర్స్ కాలనీలోని శ్రీదత్త – సాయి – భరద్వాజ సత్సంగ మందిరం నుంచి శుక్రవారం బాబా భక్తులు సారె తీసుకెళ్లారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం మహామండపంలోని ఆరో అంతస్తులో ఉన్న అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద సారెను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ భక్తుల పాలిట కొంగు బంగారమైన అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనన్న భావనతో ఆ చల్లని తల్లి అనుగ్రహాన్ని పొందేందుకు సారె సమర్పించామని తెలిపారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

ఆషాఢమాసం శుక్రవారం నేపథ్యంలో పెనుగంచిప్రోలులో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. – పెనుగంచిప్రోలు





ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పంప్‌హౌస్ పరిశీలన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు సమృద్ధిగా తాగునీటిని అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అధికారులను ఆదేశించారు. పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన జగ్గయ్యపేట పట్టణ శివారులోని హెడ్ వాటర్‌వర్క్స్(పంప్ హౌస్)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో పూర్తిస్థాయిలో రక్షిత మంచినీరు అందించాలని అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలకు త్వరలోనే పూర్తి స్థాయిలో కృష్ణాజలాలను అందజేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, కౌన్సిలర్లు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, కౌన్సిలర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు

కంచికచర్ల : స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు మోనీషా శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా మోనీషా మాట్లాడుతూ విత్తన మొదటిదశలో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పంటలు సాగు చేసే సమయంలో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. చీడపీడల నివారణ, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించాలన్నారు. 2024–25 సీజన్‌కు సంబంధించి కౌలురైతులు, గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించి రైతు గుర్తింపుకార్డులు (సీసీఆర్‌సీ) తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ వ్యవసాయ సహాయ సంచాలకు డాక్టర్ ఐకే శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, హనీష్, రైతులు పాల్గొన్నారు.



క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

వినోదాత్మక చిత్రం డార్లింగ్ వై దిస్ కొలవరి

లబ్బీపేట(విజయవాడతూర్పు): భార్యాభర్తల మధ్య జరిగే గొడవను వినోదాత్మకంగా మలిచిన చిత్రం డార్లింగ్ వై దిస్ కొలవరి అని చిత్ర కథానాయకుడు ప్రియదర్శి అన్నారు. ఈ నెల 19న చిత్రం విడుదల కానుండటంతో ఆ సినిమా యూనిట్ సభ్యులు ప్రమోషన్‌లో భాగంగా శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రియదర్శి మాట్లాడారు. దర్శకుడు అశ్విన్ రామ్ చెప్పిన కథ విని, వెంటనే హీరోగా నటించడానికి ఒప్పుకున్నట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని చూడవచ్చని, అసభ్యకరమైన సన్నివేశాలు చిత్రంలో ఉండవన్నారు. ఆ చిత్ర హీరోయిన్ నభ నటేష్ నటించిన ఆనంది పాత్ర ప్రేక్షకులకు కచ్చితంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని ఆయన కోరారు.అనంతరం హీరోయిన్ నభ నటేష్ మాట్లాడుతూ ఈ సినిమాలో తాను మతిమరుపు పాత్రలో నటించడంతోపాటు గయ్యాళి భార్యగా హీరోని ఆటపట్టించే సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. సమావేశంలో దర్శకుడు అశ్విన్ రామ్, హాస్యనటుడు కృష్ణతేజ, విష్ణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిత్ర యూనిట్ సభ్యులు

కొబ్బరి చెక్కల టెండర్ వాయిదా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివారికి భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలను సేకరించుకునే హక్కుకు నిర్వహించే టెండర్ వాయిదా పడింది. మహా మండపం నాలుగో అంతస్తులోని లీజెస్ విభాగంలో శుక్రవారం టెండర్ ప్రక్రియను నిర్వహించారు. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఆన్‌లైన్ టెండర్ వంటి మూడు ప్రక్రియల ద్వారా ఆలయ అధికారులు టెండర్‌ను ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నా, ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేసేందుకు విచ్చేశారు.